## ముగిసిన ఘటం ఊరేగింపు



ఆర్కేపురం : ఆషాఢం సందర్భంగా ఎన్టీఆర్‌నగర్ ఖిల్లా మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాలు ఘనంగా ముగిశాయి. ఖిల్లా మైసమ్మ సేవాదళ్ ఆధ్వర్యంలో ఘటం ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఉత్సవాలను విజయవంతం నిర్వహించడానికి సహకరించిన శ్రీ ఖిల్లా మైసమ్మ సేవాదళ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యనిర్వాహణాధికారి మురళీకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ గోడిసె శ్రీకాంత్‌గౌడ్, సేవాదళ్ సభ్యులు గోపినాథ్, కరుణాకర్, చాడ రమేశ్, సు మన్ శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌యాదవ్, లింగస్వామి యాదవ్, అంజి యాదవ్, మల్లేశ్ యాదవ్, బబ్లు, యోగి, బాలాజీ, సాయి, నవీన్, సాయిబాబా పాల్గొన్నారు.

## 27న ఖిల్లా మైసమ్మ ఆలయంలో బహిరంగ వేలం

ఆర్కేపురం : ఎన్టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయ వెనుక భాగంలో ఆలయానికి సంబంధించిన సుమారు 1000 చ.గజాల ఖాళీ స్థలంలో తేదీ 1-9-2024 నుంచి 31-08-2027 వరకు వర్తించే విధంగా (3) మూడు సంవత్సరాల కాల పరిమితికి గాను మోటారు గ్యారేజీ, గోదాం నిర్వహణ వంటి వ్యాపారం నిర్వహించుకోవడానికి గాను లీజుకు ఇవ్వడానికి 27న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ తెలిపారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి



మన్సూరాబాద్ : మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, చిత్రంలో కేర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలల చైర్మన్ డాక్టర్ సాంబిరెడ్డి



మలక్‌పేట యశోద దవాఖానలో ఓపీ సేవలను బహిష్కరించిన వైద్యులు

మన్సూరాబాద్, ఆగస్టు 17 : కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, కేర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలల చైర్మన్ డాక్టర్ దుర్గెంపూడి సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బాలాజీనగర్ కాలనీలో సాంబిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన ప్రదర్శనలో కార్పొరేటర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడికి పాల్పడి పైశాచికంగా హత్య చేసిన నరహంతకులకు ఉరిశిక్ష పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కేర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలల డైరెక్టర్ డి. సునీత, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ లౌకిక్ రెడ్డి, డాక్టర్ హరికుమార్, సిబ్బంది షైనీ, రత్నకుమారి, లావణ్య, కృష్ణ, గోవిందు పాల్గొన్నారు.

ఆర్కేపురం : కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై లైంగికదాడి చేసి చంపిన నిందితులను శిక్షించాలని ఓజోన్ దవాఖాన సీఈవో శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం కొత్తపేటలోని ఓజోన్ దవాఖాన ఎదుట డాక్టర్స్, వైద్య సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఓపీ సేవలను నిలిపివేసి దవాఖాన ఎదురుగా ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ.. డాక్టర్స్‌పై జరిగే దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు చట్టాలను తీసుకురావాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, జూనియర్ డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఓపీ సేవలు బహిష్కరించిన వైద్యులు

మలక్‌పేట : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యానికి సంబంధించి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు మలక్‌పేటలోని యశోద దవాఖానలో వైద్యులు ఓపీ సేవలను బహిష్కరించి నిరసనను వ్యక్తం చేశారు. యశోద దవాఖాన డైరెక్టర్ ఎ.లింగయ్య మాట్లాడుతూ.. వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణమని, తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులను బహిరంగంగా ఉరితీయాలన్నారు. ప్రభుత్వం వైద్యుల విషయంలో ప్రత్యేక చట్టాలు చేసి వైద్యులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, జూనియర్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





నల్ల రిబ్బన్లు ధరించి నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

### జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటనను నిరసిస్తూ..

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య ఘటనను నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సిద్దార్థ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులతో దిల్‌సుఖ్‌నగర్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కందుకూరి గణేశ్, మందుల సైదులు మాట్లాడుతూ.. జూనియర్ వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు, విద్యార్థులకు రక్షణ లేదని ఈ ఘటన రుజువు చేస్తుందన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చట్టాలను చేయాలని, నిందితులకు సత్వరమే శిక్షలు పడేలా చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సుమన్, సిద్దార్థ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ త్రివేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# దశల వారీగా అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి

బడంగ్‌పేట, ఆగస్టు31 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29, 31 డివిజన్లలో శనివారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటుగా పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని మేయర్ అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. పనులు చేస్తున్న క్రమంలో అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బీమిడి స్వప్న జంగారెడ్డి, పెద్దబావి శోభా ఆనంద్ రెడ్డి, పెద్దబావి దర్శన్ రెడ్డి, ఏఈ సాయిరాం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



శాలివాహననగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చెత్తను తొలగింపజేస్తున్న మూసారాంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట, ఆగస్టు 17 : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని మూసారాంబాగ్ కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శాలివాహననగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, శాలివాహననగర్ పార్కులో చెత్తాచెదారం, మట్టిని తొలగింపజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. దవాఖాన ఆవరణ పరిశుభ్రంగా ఉండటం అవసరమని, పక్కన ఉన్న పార్కు దవాఖానకు వచ్చే రోగులకు సౌకర్యకరంగా ఉందన్నారు. పార్కును అన్నివిధాల ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

కార్యక్రమంలో శాలివాహననగర్ పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యుడు డాక్టర్ తరుణ్, మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం సిబ్బంది సాయి, మల్లికార్జున్, ఏడుకొండలు, దవాఖాన సిబ్బంది మధు, నరేందర్, అపర్ణ, ఎస్‌ఎఫ్‌ఏ ముజీబ్ పాల్గొన్నారు.

# బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి





సత్యాగ్రహ దీక్షను నిర్వహిస్తున్న నాయకులు

మన్సూరాబాద్ : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని పూలే విగ్రహం వద్ద నిర్వహించిన బీసీల సత్యాగ్రహ దీక్షను చంద్రకుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. బీసీలు తమ చరిత్ర తెలుసుకుని నాగరికత మూలాలైన రాజ్యాలను స్థాపించుకోవాలన్నారు. బహుజన సాంస్కృతిక సేనాని కదిరే కృష్ణ మాట్లాడుతూ.. కులగణన చేస్తే ప్రభుత్వం కూలిపోతుందన్న భయం సీఎం రేవంత్‌రెడ్డికి ఏర్పడిందన్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కులగణన రిజర్వేషన్ల బిల్లును తీసుకురావాలని డిమాండ్ చేశారు. సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం, వివిధ సంఘాల నాయకులు కేవీ గౌడ్, చెన్నా శ్రీకాంత్, బత్తుల సిద్ధేశ్వరులు, రాజారాం యాదవ్, గోర శ్యాంసుందర్‌గౌడ్, అవ్వారు వేణుకుమార్, బొంగు ప్రసాద్‌గౌడ్, కాసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.



మన్సూరాబాద్ : నినాదాలు చేస్తున్న నర్సింగ్ కళాశాలల విద్యార్థులు





పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సిద్దార్థ మహిళా కళాశాల విద్యార్థులు

# పనులు మొదలు పెట్టిన అధికారులు



నిలిచిన మురుగునీరును చూపిస్తున్న మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్

బడంగ్‌పేట, ఆగస్టు17: ' పార్కు .. మురికి కూపం' కథనం శనివారం నమస్తే తెలంగాణలో ప్రచురితం అయింది. ఓ పక్క ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, మరో పక్కన ప్రభుత్వ పాఠశాల మధ్యన ఉన్న రోడ్డుపై, పార్కు వద్ద మురుగు నిండిపోయింది. ప్రచురితమైన కథనాన్ని చదివిన మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడారు. ఇక్కడికి వచ్చేదాక ఉంటానని, రెండు గంటల పాటు భీష్మించుకొని అక్కడే ఉన్నారు. అధికారులు వచ్చి పనులు మొదలు పెట్టే వరకు మేయర్ ఉన్నారు. నెలల తరబడి మురుగునీరు రోడ్లపై పారుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మేయర్ ఆదేశాల మేరకు అధికారులు పనులు చేయిస్తున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఎట్టకేలకు పనులు చేస్తుడటంతో కాలనీ వాసులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## భక్తి శ్రద్ధలను అలవర్చుకోవాలి



భక్తి శ్రద్ధలను అలవర్చుకోవాలని అఖిల భారత ముదిరాజ్ ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ తెలిపారు. లేమూరులో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల నారాయణ, యాదయ్య, ఎడ్ల బాబురావు, బొర్రమోని నరేందర్, మాజీ సర్పంచ్‌లు గణేశ్, పరంజోతి పాల్గొన్నారు.

- కందుకూరు

## సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యాయత్నం

హయత్‌నగర్, ఆగస్టు 17 : అప్పుల బాధ తాళలేక మదర్ డెయిరీ సంస్థ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శారదానగర్‌లో పీవీజీ శివకుమార్, కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. 1997 నుంచి హయత్‌నగర్‌లోని నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నార్మూల్ మదర్ డెయిరీ సంస్థకు శివకుమార్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆయనకు పెద్ద కుమార్తె మోహన సాయి, చిన్న కుమార్తె భార్గవి ఉన్నారు. ఇటీవల చిన్న కుమార్తె పెండ్లికి యాక్సిస్ బ్యాంకులో లోన్, ఓ వ్యక్తి వద్ద, బజాజ్ ఫైనాన్స్‌లో అప్పులు చేశాడు. కొంత కాలంగా శివకుమార్‌కు సంస్థ వేతనం చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం డ్యూటీలోనే శానిటైజర్, ఎలుకల మందును తాగాడు. సంస్థ మేనేజర్‌కు వీడియో కాల్ చేస్తూనే మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన సిబ్బంది చికిత్స నిమిత్తం శివకుమార్‌ను హయత్‌నగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గుడిసెవాసుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న శంకర్‌నాయక్

సైదాబాద్, ఆగస్టు 17 : సింగరేణి కాలనీ గుడిసెవాసుల సమస్యలు పరిష్కరించాలని శనివారం సైదాబాద్ తహసీల్దార్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ నాయకుడు ఆర్.శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఏండ్ల తరబడి సింగరేణి కాలనీలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు రెగ్యూలైజేషన్ చేసి పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రౌద్రీ సొసైటీ వారు నిర్మిస్తున్న అక్రమకట్టడాలు నిలిపివేయాలని, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జయశ్రీ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు విక్రం, సద్దాం, విజయ్, చక్రి, అంజయ్య, నర్సింగ్, నాగరాజు, భాస్కర్, షేక్ మహమూద్, విజయ్, దశరథ్, జంగయ్య, దాసు పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని పరిరక్షించాలి

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డ్స్ హోల్డర్, సామాజిక కార్యకర్త, డాక్టర్ పెండెం కృష్ణకుమార్ కోరారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని మన్సూరాబాద్, ప్రెస్ కాలనీలోని జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు మెడికల్ కిట్లు, వాటర్ క్యాన్లు, ఆట వస్తువులు, వాల్‌క్లాక్‌లు అందజేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరుతూ.. జూట్ బ్యాగులు అందజేశారు. హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయుడు రామలింగం, సిబ్బంది సిద్ధు, రాజ శ్రీ, వసుంధర, పద్మ, అనురాధ, జయంతి పాల్గొన్నారు.

- మన్సూరాబాద్

# 'స్వామి అయ్యప్ప' పౌరాణిక నాటకం ప్రదర్శన



వనస్థలిపురం, ఆగస్టు 17 : రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో పౌరాణిక పద్యనాటక పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం టి.బి.ఆర్. ఆర్ట్స్ సంస్థ పటాన్‌చెరు ఆధ్వర్యంలో స్వామి అయ్యప్ప పద్య నాటికను ప్రదర్శించారు. నవజ్యోగి కళామండలి ఆధ్వర్యంలో మైరావణ నాటికను ప్రదర్శించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రాచీన కళ అయిన పౌరాణిక పద్యనాటకాన్ని ప్రోత్సహించాలని, ఆదరిస్తేనే ఏ కళ అయినా మనగలుగుతుందని పలువురు అన్నారు. మొవ్వా బాబురావు, సోమయాజులు, అచ్యుత రామయ్య, సూర్యనారాయణ, పుండరీకాక్షుడు, పంపన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# టీజీఎస్‌ఆర్టీసీ నూతన కార్గో పాయింట్ సెంటర్ ప్రారంభం





ఎల్బీనగర్ చౌరస్తా సమీపంలో కార్గో పాయింట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మధుసూదన్, వెంకట్ నారాయణ

ఆర్కేపురం, ఆగస్టు 17 : ఎల్బీనగర్ చౌరస్తా (జిల్లా బస్సులు ఆగే అలైటింగ్ పాయింట్) వద్ద నూతనంగా టీజీఎస్‌ఆర్టీసీ కార్గో పాయింట్ సెంటర్ ప్రారంభించినట్లు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ డిప్యూటీ సీటీఎం మధుసూదన్ తెలిపారు. ఎల్బీనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ, మిర్యాలగూడ, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, మధిర, పాల్వంచ, ఇల్లెందు, సూర్యాపేట, కోదాడ, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, గుంటూరు.( ఆంధ్రప్రదేశ్ ) వైపు నుంచి వనస్థలిపురం, ఎల్బీనగర్, దిల్‌సుఖ్ నగర్, కర్మన్‌ఘాట్, ఉప్పల్ ప్రాంతాలకు పార్సిల్ బుక్ చేయాలనుకునే వారు ఎంజీబీఎస్‌కు వెళ్లకుండా డైరెక్ట్‌గా పార్సిల్‌లు అందజేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కావున ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏటీఎం (జీహెచ్‌జెడ్) వెంకట్ నారాయణ, ప్రదీప్, అమరేంద్ర రాజు, సతీశ్, సత్యనారాయణ, మురళీధర్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

## ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి



మాట్లాడుతున్న మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్

మలక్‌పేట, ఆగస్టు 17 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ సూచించారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో శనివారం గడ్డిఅన్నారంలోని రాజీవ్ కమ్యూనిటీ హాల్లో మలక్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో మైత్రీ, పీస్ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, ఉత్సవకమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండపాల నిర్వాహకులకు ఆయన పలు సూచనలు చేశారు. నిర్వాహకులు పోలీసుల సూచనలను పాటించాలని, అందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్, ఎస్సైలు నవీన్, సురేశ్, పోలీసు సిబ్బంది, మండపాల నిర్వాహకులు, మైత్రీ, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చెరువులను చెరపడుతున్న కబ్జారాయుళ్లు

## ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఏదైనా లెక్కలేదు



చెరువుకు గండి కొట్టిన దృశ్యం

పహడిషరీఫ్, ఆగస్టు 17 : ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమిస్తూ అధికారులకు కబ్జారాయుళ్లు సవాల్ విసురుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను కాపాడుతామంటూ హెచ్చరికలు చేస్తున్నా అదేం మాకు పట్టనట్లు కబ్జారాయుళ్లు చెలరేగిపోతున్నారు. గత ప్రభుత్వం చెరువుల రక్షణకు చర్యలు చేపట్టి భూగర్భ జలాల సంరక్షణ కోసం స్థానికులను సైతం భాగస్వాములను చేస్తూ పటిష్ట చర్యలు తీసుకున్నది. నేడు చెరువులను చెరపడుతున్న కబ్జారాయుళ్లతో రైతన్నలు, స్థానికులు భవిష్యత్‌లో ఇబ్బందులను ఎదుర్కోనాల్సిన దుస్థితి రానున్నదని పలువురు వాపోతున్నారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపంలో జల్లపల్లిలోని సాయికుంట త్వరలో కనుమరుగుకానున్నది.

### తాళ్లకుంటలో కబ్జాల పర్వం..

శివారు ప్రాంతాల్లో జోరుగా రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడంతో కబ్జారాయుళ్ల కండ్లు చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లపై పడింది. అధిక ధరలకు భూములు కొనుగోళ్లు సాగుతున్న తరుణంలో అమ్మకానికి కాదేది అనర్హం అంటూ కనిపించిన చెరువులు, కాలువలు, బఫర్‌జోన్‌లలోని స్థలాలపై కన్నేసిన స్థానిక కబ్జాదారులు అందినంత భూమిని ఆక్రమిస్తూ అక్రమ వెంచర్‌లను సృష్టిస్తున్నారు. జల్లపల్లి పరిధిలోని తాళ్లకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి సుమారు 6 ఎకరాలు. కానీ నేడు ఆ చెరువు కేవలం 1 నుంచి 2 ఎకరాల వరకు మాత్రమే పరిమితం చేసి 4 ఎకరాల స్థలాన్ని పూర్తిగా కబ్జాచేసి దర్జాగా పాట్లుగా విభజించి అమ్మకాలు సాగిస్తున్నారు. మరోవైపు చెరువు ఆనవాళ్లు లేకుండా తూంలను సైతం ధ్వంసం చేస్తూ మాకెవ్వరు అడ్డుఅంటూ తమ పనులను సాగిస్తున్నారు. అయినా అటూ రెవెన్యూ , ఇటు మున్సిపల్ అధికారులు కాని తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికంగా చెరువుల రక్షణ కోసం పాటుపడుతున్న యువకులు వాపోతున్నారు. గతంలో అధికారుల దృషికి కబ్జాల విషయాన్ని తీసుకెళ్లినా తూ..తూ..మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఒకటి రెండు రోజుల తర్వాత యథావిధిగా కట్టడాలు సాగుతున్నాయని స్థానికులు తెలిపారు.

### వివరాలు తెలుసుకొని అడ్డుకుంటాం

ఎఫ్‌టీఎల్‌లో జరిగే అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేస్తాం. గతంలో పలుమారుల స్థానికులు ఫిర్యాదులు చేశారు. కొన్నింటిని గుర్తించి అక్రమ కట్టడాలను కూల్చివేశాం. ప్రస్తుతం నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. తూం కూల్చివేసిన విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.ప్రజలు సైతం ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ నిషేధిత స్థలాలను కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- గంగరాజు , ఇరిగేషన్ ఏఈ

